# ప్రేమకాటుకి డబ్బు దెబ్బ

- శంకరమంచి పార్ధసారధి

ప్రేమ మత్తులాంటిది. ఆ మైకంలో వున్న కుర్రాళ్ళు ఆవాకులు చెవాకులు వాగిపారేయటం సహజం. సచిన్‌కి బ్యాట్ ఎలా పట్టుకోవాలో నేర్పింది తనేనంటాడు. మణిరత్నం ఇంటికొచ్చి తనని హీరోగా పెట్టి సినిమా తీస్తానని మూడు గంటలు బతిమిలాడినా సారీ చెప్పి పంపించేసానంటాడు.

పాపారావు సురేఖ ప్రేమలో పడి ఏడాది కావొస్తోంది. సురేఖకి ధైర్యవంతుడు, త్యాగవంతులు ,అంటే ఇష్టమని గ్రహించి తన వీరోచిత సాహసకృత్యాల్ని కల్పించి ఇష్టంవచ్చిట్టుగా వాగేడు.

" నీకు విజయవాడలో వీరాసామి తెలుసా "

" వాడెవడు ? "

" జులాయి వెధవ. మార్కెటు దగ్గర ఒక విడోని వెంట పడి వేధిస్తుంటే, వాడిని మార్కెట్ మెట్టుపైన పడేసి కొడుతుంటే, జనం మూగి ఒకటే క్లాప్స్. బహుశా రాణాసురిడిని చంపినప్పుడు రాముల వారిక్కూడా అంత అప్లాజు వచ్చి వుండదు. పక్కనే వున్న పూలదుకాణం వాడు కన్నీళ్ళతో వచ్చి మెళ్ళో దండ వేసాడు "

" నిజంగా ఓ మైగాడ్ " అంది సురేఖ ఆశ్చర్యంగా.

ఇలాంటి సాహసోపేతమైన వీరోచిత కధలు రోజుకి రెండు మూడు చొప్పున చెప్పటంతో సురేఖకి పాపారావు ఆపద్బాంధవుడు , అనాధరక్షకుడు , సింహబలుడు వగైరా వగైరాల్లా కనిపించసాగేడు. ఇప్పుడు అదే పాపారావు మెడకి చుట్టుకుంది.

ఒకరోజు సురేఖ మనం అర్జంటుగా కలవాలి అని ఫోన్‌చేస్తే పాపారావు పావుగంటలో ఆమె ముందు వాలిపోయి ఏమిటి మేటరన్నాడు.

సురేఖ మేటరు చెప్పింది " నువ్వు వెంటనే విజయవాడ వీరాసామిని కొట్టినట్టు ఒక రౌడీ వెధవని చితకతన్నాలంది. అది వినంగానే పాపారావుకి ప్యాంటు తడిసిన ఫీలింగొచ్చింది.

అలా అనుమానం రావటంలో ఆశ్చర్యంగాని, అనుమానంగాని, అతిశయోక్తిగాని

ఏమాత్రం వుండటానికి వీల్లేదు. సురేఖ జరిగింది చెప్పాక పాపారావుకి చలిజ్వరం వచ్చినట్టు సన్నటి వణుకు పుట్టుకొచ్చింది . పహిల్వాను, వెయిట్ లిఫ్టరు అయిన అప్పారావు అలియాస్ బండప్పిగాడ్ని తను చితకబాదాలా ! హే ! భగవాన్ ఏమిటి నాకీ పరీక్ష !

అప్పారావు హనుమాన్ వ్యాయామశాలలలో కోచింగ్ ఇస్తూవుంటాడు. బోడిగుండు, పెద్ద పెద్ద మీసాలు, ఇనుప గుళ్ళులా కండలు, వెన్ను విరుచుకుని నడుచుకుంటూ వస్తుంటే, మిలట్రీ వాహనానికి సైడిచ్చే చిన్ని చిన్ని వాహనాల్లాగా జనం పక్కలకి తప్పుకుంటారు.

రోజుకి పాతిక గుడ్లు, రెండు కోళ్ళు, లీటరు పాలువాడి మినిమమ్ మెనూ, వడ్లబస్తాని ఊకబస్తాలా విసిరెయ్యగలడు. ఒకసారి వానకి పెద్ద చెట్టు దారికడ్డంగా కూలిపోతే , పోలీసు వారు అప్పారావుని రంగంలోకి దించటం వాడు ఆ మహావృక్షాన్ని పిచ్చిమొక్కని తీసేసినట్టు తీసిపారేశాడు.

అంచేత అందరూ వాడిని బండప్పిగాడంటారు. వాడి చెల్లెలు సురేఖ క్లాస్‌మేట్స్, ఆ రోజు లంచ్ టైంలో చెట్లకింద కూర్చుని కబుర్లు చెప్పుకుంటుంటే వాడి చెల్లెలు , నిన్న వాళ్ళన్నయ్య ఒక ఈవ్ టీజర్ని ఎలా ఉతికాడో వర్ణించి చెప్తుంటే, సురేఖ శ్రోతగా ఉండకుండా " అబ్బో ఇదో పెద్ద ఘనకార్యమా ? పిల్లవాడిని చేసి కొట్టడం హీరోయిజమా ? మా పాపారావైతే పులులు, సింహాల్ని గడగడాలాడించాడు. డాక్టర్లు, లాయర్లు , యాక్టర్లు – ఒక్కరేమిటి, అందరినీ ఒంటిచేత్తో తోక ముడిచేలా చేసాడు తెల్సా " అంది గొప్పగా.

అది విన్న బండప్పిగాడి చెల్లెలికి రోషం, బాధముంచుకురాగా

" అంటే మీ పాపారావు హీరో అంటావ్ – మా అన్నయ్య ఉత్త జీరో అంటావ్. అంతేగా " అంది రోషంగా.

ఇద్దరు స్త్రీలు వారి వారి తాలుకు మగవారి శౌర్య ప్రతాపాల గురించి చర్చ వచ్చినప్పుడు ఏ ఒక్కరూ వెనక్కి తగ్గి మీవాడే గొప్ప, మావాడుత్త పనికిమాలిన చవట అని అనరు. ఒప్పుకోరు . ఆరోజు అక్కడ వారిద్దరి మధ్య అదే జరిగింది. మాటామాటా పెరిగింది. ఆవేశకావేషాలు పతాకస్థాయికి చేరుకున్నాయి.

చివరికి మేటర్ ఎక్కడ ఆగిందంటే, అప్పిగాడి చెల్లెలు సురేఖతో, " సరే రేపు ఉదయం నీ పాపారావుని తీసుకురా, నేను నా అప్పారావన్నయ్యని తీసుకొస్తా. ఎవరు ఎవర్ని కొడతారో ఎవడు గొప్పో, ఎవడు కాదో తేల్చకుందాం " అంది.

" రెడీనా " ఆ ఛాలెంజ్‌కి సురేఖ చాలా ఈజీగా కాళ్ళూపుకుంటూ " ఓకే. అలాగే .డన్ మా పాపారావు దెబ్బేమిటో తెలుస్తుంది. ఆ చెంపా ఈ చెంపా వాయించి పారేసి, కిందపడేసి కుళ్ళబొడుస్తాడు "

" ఏంటి ? చెంపలు వాయించి కుళ్ళబొడుస్తాడా. అంత సీన్ వుండదమ్మా "

పిచ్చిదానా నీకేం తెల్సు. సింహాలే తోకముడిచి పారిపోయినాయి. రేపు నిజంగా దమ్మూ ధైర్యం వుంటే మీ అన్నని రమ్మను. రెండు చెంపలూ వాయింపచేసే పూచీ నాది. రెడీన ? " అంది సరేఖ.

" రెడీ. డన్ .రేపు మార్నింగ్ పదిగంటలకి "

ఇదీ జరిగింది. మరి పాపారావుకి ప్యాంటు తడిసిన ఫీలింగు రావటంలో తప్పులేదుకదా .....

ఇటు చూస్తే ప్రియురాలు ప్లస్ ప్రేమ. అటు చూస్తే పహిల్వాన్ ప్లస్ ప్రాణభయం . ఏది దారి. ఎటుపోవాలి. ఏం చెయాలి.

తీవ్రంగా ఆలోచించిన మీదట గుర్తుకొచ్చాడు మటన్‌షాప్ యజమాని మస్తాన్. మస్తాన్ షాపునించి బండప్పిగాడు చికెన్, మటన్ తీసుకెళ్ళటం ఒకసారి చూసాడు పాపారావు. అంతేవెంటనే రివ్వుమనుకుంటూ వెళ్ళి మస్తాన్ షాపుముందు నిల్చున్నాడు.

అయ్యోపాపం అనిపించేలా నిల్చున్న పాపారావుని " ఏంటి బాబూ ఇలా వచ్చేవు , ఏంటి కావాలి మటనా, చికెనా " అనడిగాడు మస్తాన్.

పాపారావు జరిగింది. మొత్తం చెప్పి " నువ్వే నాకోదారి చూపించాలి మస్తాన్ " అన్నాడు. వీతైనంత జాలిగా.

బండప్పిగాడు మాస్తాన్‌కి అయిదువేలు అప్పున్నాడు. ఎన్నిసార్లు అడిగినా అదిగో ఇదో అంటూ దాటవేస్తున్నాడుగాని పని మాత్రం కావటంలేదు.

మానవ సంబంధాలకన్నా ఆర్ధిక సంబంధాలు బలమైనవి కాబట్టి, పాపారావు చెప్పిన విషయం వినగానే బండప్పిగాడి మొండిబాకీ వసూలు చేసేదారి కనిపించినట్టయ్యింది.

" బండప్పిగాడితో వ్యవహారం అంత తేలిగ్గాదు. చాలా కష్టం. అందులో ఇది ఆస్తిగొడవో, నీటి తగాదానో కాదాయె, ఆడోళ్ళ గొడవ, నువ్వు చాలా ఆలోచించి ఆచితూచి అడుగెయ్యాలి "

" అవును మస్తాన్ చాలా జాగ్రత్తగా ఉండాలి. ఈ సాయం చేసావంటే నీకష్టం ఉంచుకోను. నా కుతోచింది సంతోషంగా ఇచ్చుకుంటా " అన్నాడు దీనంగా.

" భలేవాడివయ్యా ....నువ్వేం పరాయివాడివా నా షాపులోని చికెన్, మటన్ తిని ఇంత వాడివయ్యావ్. అలాంటివేం పెట్టుకోకు. నువ్వు ఇక్కడ కూర్చుని పేపరు చదువుతుండు . నేనెళ్ళి వాడితో మాట్లాడొస్తా " అనేసి మరోమాటకి తావులేకుండా స్కూటర్ ఎక్కి వెళ్ళిపోయాడు మస్తాన్.

పాపారావు గుండె దడదడలాడిపోతోంది.

" బండప్పిగాడు ఏవంటాడో, అయినా తన పిచ్చి గాని, మస్తాన్ ఎంత చెప్పినా ఎన్ని విధాలుగా బతిమాలినా కండలవీరుడు కరిగిపోయి " సర్లే మస్తాన్ . ఆ కుర్ర వాడిని వచ్చి తన ఇష్టం వచ్చి రీతిలో , ఇష్టమైనంత సేపు కొట్టుకోమను అంటాడా " అనడుగాక అనడు.

సురేఖ ముందు తల వంచుకోవటంకన్నా రాత్రికి రాత్రి బంధువులెవరో పోయారని ఊరెళ్ళుతున్నానని ఫోన్ చేసి మొహం చాటేస్తే ? "

ఇలా పాపారావు ఆలోచన్లు సాగుతుండగా పావుగంట తర్వాత మస్తాన్ వచ్చాడు. చాలా గంభీరంగా ఉన్నాడు. వెళ్ళి తన సీట్లో కూర్చుని, మాట్లాడానయ్యా. విషయం తెలిసి మండిపోతున్నాడు. బుసలుకొడుతున్నాడు. ఆ కుర్రవాడిని – అంటే నిన్ను నా కండలతో కాదు కంటి చూపుతో చంపేస్తానంటున్నాడు. వాడిని సముదాయించి దారికి తెచ్చేసరికి నా తల ప్రాణం తోకలోకి వచ్చింది "

" హమ్మయ్య దారికి వచ్చాడు గదా . థాంక్స్ మాస్తన్ నీ మేలు " అన్నాడు పాపారావు.

" ఆగాగు పూర్తిగా విన్నా మాట్లాడు. నువ్వు నాకు కావాల్సినవాడివని, ఒకసారి నాకు తేలుకుడితే, తీసుకెళ్లి మంత్రం వేయించావని, అంచేత నా మొహం చూసయినా అతడిని క్షమించాలని , నిజానికిది ఆడవాళ్ళ గొడవని, ఇలాంటి విషయాల్లో ఆవేశపడితే పరువు పోతుందని చెప్పగా చెప్పగా నీకో ప్యాకేజీ ఇచ్చాడు "

" ప్యాకేజా ...అంటే " అడిగాడు పాపారావు.

" అంటే రేపు మీరిద్దరూ ఎదురవుతారు. నీ ప్రియురాలు ప్రతిజ్ఞమేరకు నువ్వు వాడిని చెడామడా తిట్టి, ఎడాపెడా కొడతావ్. వాడు చెయ్యెత్తడు. నోరు తెరవడు కానీ – ఈ క్లాజు జాగ్రత్తగా విను.

అయిదు నిమిషాలు టాక్ టైమ్ ఫ్రీ. అంటే అయిదు నిమిషాల్లో నువ్వేం తిట్టినా మాట్లాడడు. ఆ తర్వాత ప్రతి తిట్టుకి అయిదొందలు. అలాగే రెండు చెంపదెబ్బలు ఫ్రీ. ఆపైన ప్రతి దెబ్బకీ వెయ్యి రూపాయలు "

పాపారావు  నోరు తెరిచాడు “ అమ్మో చాలా కాస్ట్ లీ మస్తాన్. డిస్కౌంటు ఉండదా ” అన్నాడు.

“ ఉండదు. అయిదు వేలు రెడీ చేసుకో రేపొచ్చి  తిట్టి, కొట్టి పేమెంట్  నాకిచ్చి నువ్వు  హీరోలాగా  వెళ్ళిపో . మిగిలినది నేచూసుకుంటా. ఇంటికెళ్ళి  ప్రిపేరవ్వు  ” అని పంపించేశాడు.

మర్నాడు పదిగంటలకి  బండప్పిగాడిని  వెంటబెట్టుకుని వాడి చెల్లెలు , కబేళానికి మేకపిల్లని  లాక్కొచ్చినట్టు పాపారావుని తీసుకుని  సురేఖా వచ్చి  ఎదురెదురుగా మొహరించాడు

“ వీడే  మా అప్పారావన్నయ్య. ఇతనా  నువ్వు చెప్పిన పాపారావు ” అంది బండప్పగాడి  చెల్లెలు.

రాత్రంతా ఆలోచించి  తీసుకున్న నిర్ణయం  మేరకు, పాపారావు  అప్పారావుని పరిశీలనగా  చూసి “ నువ్వు అప్పారావువా ” అన్నాడు.

“ అవును. నువ్వెవరు  ” అన్నాడు అప్పారావు.

దానికి పాపారావు  చేతులు  చాపి  ఒక్క ఉరుకులో  ఎగిరి  చంకనెక్కి  “ నేన్రా పాపారావుని. పాపికొండలు ”

వాడు తెల్లబోయి  పాపికొండలేంటి ? ”

“ గుర్తు రావటం లేదా మీనాక్షి, కామాక్షి ట్విన్స్ ” అన్నాడు పాపారావు.

“ కామాక్షి మీనాక్షినా ట్విన్సా. అయితే  అప్పటికే  పాపారావు  అప్పారావు జేబులోకి అయిదువేలు  తోసేసి, “ నవ్వు కండలు  పెంచావ్‌గానీ,  మెమరీపోయింది. సురేఖా, వీడు నా  బెస్ట్ ఫ్రెండ్ ”

అప్పారావు  జేబు తడముకుని

“ నా క్కాస్త  టైమియ్యి  పాపారావ్. లీలగా గుర్తుంది గానీ సీన్లో క్లారిటీ రావటంలా ”

సురేఖని  పరిచయం చేసి “ బ్రదర్  మీ మరదలు  ” అని  పాపారావు  ఒంగి పాదాలు  గోకేడు. “ గాడ్ బ్లెస్  యూ ” అనుకుంటూ  రధంలాగా  కదిలి వెళ్ళిపోయాడు అప్పారావు. మటన్ కొట్టు మస్తాన్‌కి  మేటరు  బొత్తిగా అర్ధంకాక “ ఛీ నిలకడ లేని మనుషులు  ” అనుకుంటూ  వెళ్ళిపోగా  పాపారావు ఊపిరి పీల్చుకున్నాడు.

------- అయ్యిపోయింది -------